
# కోరిక

**అద్దేపల్లి సుమిత్రాదేవి**



**"పరువం వానగా నేడు కురిసేనులే**
**ముద్దు మురిపాలలో ఈడు తడిసేనులే!"**

**ఎంత మధురమైన పాట....ప్చ్ ... ఈ పాట మురళి ఒడిలో పడుకుని వింటే ఇంకా బాగుంటుంది. టూఇన్‌వన్ నోరు నొక్కేసి రాధిక పక్కకు చూసింది.**

ఆరేళ్ల వంశీ హాయిగా నిద్రపోతున్నాడు. రాధికకు నిద్ర రాలేదు. టీ.వీ. అన్నా చూస్తే కాస్త కాలక్షేపం అనుకుంటూ లేచి హాల్లోకి వెళ్లి టీ.వీ. ఆన్ చేసింది.

అది ఆనవడం తెరమీద వేడివేడి సీను ప్రత్యక్షమైంది. దాదాపు అర్ధనగ్నం గా హీరో హీరోయిన్‌పాటలో ఉన్నారు. సంగీతాని కనుగుణంగా వారు చేసే శృంగారనృత్యం, ఆ భంగిమలు చూస్తున్న రాధిక శరీరం అప్రయత్నంగ్గానే వెచ్చబడింది.

ఛానెల్ మార్చింది. అక్కడా అదే సీను.

అంతలో అత్తగారి గదిలోంచి దగ్గు వినపడడంతో ఒంటరిగా అర్ధరాత్రి పూట కూర్చుని ఇలాంటి సినిమాలు చూస్తుంటే ఆవిడ గమనించి ఏమనుకుం టుందోనని టీ.వీ. ఆఫ్ చేసేసింది.

"ఏ ఆలోచనలు వద్దనుకుంటామో మనసు పదేపదే అటే లాగుతుందే మిటి?' ' విసుగ్గా బుక్‌రాక్‌లోంచి చేతికందిన ఓ పుస్తకం తీసుకుని మళ్లీ బెడ్ రూమ్‌లోకొచ్చి లైటు వేసి పుస్తకంలోకి దృష్టి మళ్లించింది.

అదో ఇంగ్లీషు నవల. ఓ పది పేజీలు ఓపిగ్గా చదివింది కానీ ఆపై చిరాగ్గా నవల అవతల పడేసి లైటార్పేసింది.

"ఛత్! మరీ ఏం నవలలో ఏవో. మొదలుపెట్టడమే సెక్స్. ఆ కార్యక్రమమై నా ఏమన్నా ముగిసేట్లుందా అంటే ఊహు, సాగుతూనే ఉంది. అయినా ఈ ఇంగ్లీషు నవలల్లో తిండేం తింటున్నారు, సెక్స్ ఎలా చేస్తున్నారు? ఈ రెండింటి వర్ణనకి ఇంత ప్రాముఖ్యత ఎందుకిస్తారో?" అటు నుంచి ఇటు తిరిగింది.

"ఏం చేస్తుంటాడీయన ఈ టైమ్‌కి హోటల్‌రూమ్‌లో హాయిగా ముసుగు పెట్టి నిద్రపోతుంటాడా? లేక ఎంతయినా మగవాడు కదా, అవకాశం వదులు కోకుండా అక్కడ ఎవరితోనైనా ఎంజాయ్ ... ఛ!ఛ! తన మురళి అలాంటివాడు కాదు!"

ఎప్పటిలానే 'కాకూడదని' భగవంతుణ్ని ప్రార్థించింది.

ప్చ్ ... ఎందుకీయన ఈ రోజు మరీ ఇంతగా గుర్తొస్తున్నాడు? దిండుకింద దాచి ఉంచుకున్న భర్తషర్టు తీసి గుండెలకదుముకుంది. భర్తకౌగిలిలో ఉన్న వెచ్చని అనుభూతి కలిగింది. ఆపై తీయని కలలలోకి జారిపోయింది రాధిక నిదురలో.

* * *

టింగ్ టింగ్‌మంటున్న కాలింగ్‌బెల్ శబ్దానికి ఉలిక్కపడి లేచింది రాధిక.

"అరె, బాగా తెల్లారిపోయిందే! ఇంత మొద్దు నిద్రపోయానేమిటీ?" చీర సవరించుకుని వెళ్లి తలుపు తీసింది.

గుమ్మంలో సూట్‌కేసుతో మురళీధర్.

"అంత నిద్రా?" అంటూనే సూట్‌కేసు గోడవారగా పెట్టేసి, తలుపు గడి యపెడుతున్న భార్యను అలాగే దగ్గరకు తీసుకున్నాడు. రాధిక మాట్లాడేం దుకు కూడా ఇష్టం లేనిదానిలా భర్త కౌగిలిలో గువ్వలా ఒదిగిపోయింది.

## స్వాతంత్ర్యం

**శేఖర్**: "మా తాతయ్య ఒకప్పుడు స్వాతంత్ర్య సమరయోధుడు...తెలుసా?"

శ్రీను: "ఓసోస్...అంతేకదా! మా తాతయ్య ఇప్పటికీ స్వాతంత్ర్యంకోసం పోరాడుతూనే ఉన్నాడు. కాని, మా నాయనమ్మే స్వాతంత్ర్యం ఇవ్వటంలేదు."

**చందూ వంశీ**, నంద్యాల

"వారం ఉండిపోయారేమిటి?" గుసగుసగా అంటూ భర్త ఛాతీపై ముద్ది నస్తా మురిపాలుపోయింది.

"ఇలాగే పద, ఇంకాసేపుంటే పనిమినిషి వచ్చేస్తుంది. వంశీ లేచేస్తాడు. అమ్మ కూడా ..." అతని మాటలు పూర్తి అయ్యేలోపల "డాడీ!" అంటూ పరుగెత్తుకొచ్చి కాళ్లకు చుట్టుకున్నాడు వంశీ.

కొడుకుని చూసి గాబరాగా భార్యకు దూరం జరిగాడు మురళి. "అప్పుడే నిద్ర లేచేశావా? గుడ్ బాయ్!" వాణ్ని దగ్గరకు తీసుకుంటూ ప్లేటు ఫిరాయిం చేశాడు.

ఇంతలో పక్క గదిలోంచి పెద్దావిడ గొంతు వినిపించింది.

"రాధా! ఎవరొచ్చారు, అబ్బాయా?"

"ఆc, నేనేనమ్మా!" బుద్ధిమంతుడిలా తల్లికి జవాబిస్తూ అటు నడుస్తున్న భర్తని చూసి ముసిముసిగా నవ్వుకుంటూ లోపలికి నడిచింది రాధిక.

* * *

మామూలుగా తొమ్మిదింటికి ఆఫీసుకి వెళ్లబోతున్న భర్తకి కర్చీఫ్, లంచ్ పాక్ అందిస్తూ చెవిలో లోగొంతుకతో చెప్పింది - "పదిరోజుల తర్వాత ఆఫీసుకి వెళ్తున్నాం కదాని ఫ్రెండ్స్ పిలిచారు అదీ ఇదని కారణాలు చెప్పి ఇంటికి రావడం లేటు చేయకండి! త్వరగా వస్తే బోలెడు కబుర్లున్నాయి, మీకు చెప్పాల్సినవి!"

"వొట్టి, కబుర్లేనా, కార్యాలు కూడా ఏమన్నా ఉన్నాయా?" కొంటెగా అడిగాడు మురళీధర్.

"ఛ! ఊరుకోండి! అన్నీ పైకి చెబుతూ ..." కార్యంనాటి వధువులా సిగ్గుపడిపోయింది రాధిక.

* * *

పెళ్లయి ఎనిమిదేళ్లయి, ఒక బిడ్డకు తల్లయినా ఇంకా పెళ్లికాని అమ్మాయి లా మిసమిసలాడుతూ, విరబూసిన అరవిందంలా ఉండే భార్య సొగసులు తలుచుకుంటూ ఏవేవో ఊహించుకుంటూ ఆఫీసు నుంచి హుషారుగా ఇంట్లో కి అడుగుపెట్టిన మురళీధర్ అవాక్కయి నిలుచుండిపోయాడు.

హాలంతా చుట్టాలతో నానా గందరగోళంగా రైల్వే ప్లాట్‌ఫారంలా ఉంది. మురళి పెద్దనాన్న గారమ్మాయి సుమతి, ఆమె భర్త, ఇద్దరు పిల్లలు, వాళ్ల ఆడపడుచు వచ్చి ఉన్నారు.

"ఏం అక్కయ్యా! బావున్నారా బావగారూ? ఏమర్రా పిల్లలు!" అంటూ అందర్నీ నవ్వుతూ పలకరించాడు.

"బాగున్నాంరా తమ్ముడూ! నువ్వేమిటి ఇలా చిక్కిపోయావు? కాంప్ నుంచి ఈ రోజు ఉదయమే వచ్చావటగా. ఇంట్లో నెలకి పట్టుమని పదిరోజు లుంటే ఎక్కువొదినా అని చెప్పింది రాధిక. ఇదేం ఉద్యోగంరా?" గలగల మాట్లాడింది సుమతి.

"ఏం చేస్తాం? కొన్ని ఫెసిలిటీస్ కావాలనుకుంటే మరికొన్ని వదులుకోక తప్పదు. ప్రైవేటుకంపెనీ అయినా జీతం బాగానే ఇస్తున్నారు. వాళ్లకి బోలెడు వ్యాపారాలు, బ్రాంచీలు. ఎప్పుడు ఎక్కడికి వెళ్లమన్నా తప్పదు కదా!"

మురళి మాటలకి సుమతి భర్త సుబ్బారావు తల ఊపాడు. "అంతే కదా మరి! ఆc, మా స్నేహితుడి పెళ్లికి వచ్చాం, మురళీ! లేటు మారేజిలే! ఈ ఊరిలో అనగానే మీ అక్కయ్య కూడా బయలుదేరింది. చెల్లాయి హైదరాబాదు చూడాలని చెప్పటంతో సపరివారంగా బయలుదేరేశాము.'

"మంచి పని చేశారు. ఈ వంకతోనన్నా ఇటు వచ్చారు. ఆc, రాధీ! అక్కయ్యావాళ్లకి ఏం స్పెషల్స్ చేస్తున్నావు?" వంటింట్లోకి తొంగి చూశాడు.

కొంగు బిగించి, చీర కుచ్చెళ్లు పైకి దోపి ,కూరలు కట్‌చేస్తూ, మిక్సీ వేస్తూ, స్టవ్‌పై గిన్నెలో కలియబెడుతూ బొంగరంలా అటూ ఇటూ తిరుగుతూ చాలా బిజీగా కనిపించింది రాధిక.

"పాపం!" జాలేసింది మురళికి. ఓ క్షణం తలెత్తి చూసింది రాధిక. గుమ్మంలో అటూ ఇటూ చేతులు చాపి నిలుచుని ఉన్న మురళిని వెళ్లి అలాగే అల్లుకుపోవాలన్న కోరికను బలవంతాన ఆపుకుంది.

"ప్చ్! ఏమీ లాభంలేదు. ఈ రోజు పస్తే!" భార్య కళ్లలోని కోరికను గమనిం చి తన కోరికకూ పగ్గం వేసుకుంటూ చిన్నగా గొణిగాడు మురళి.

అతనంటున్న తీరుకి నవ్వొచ్చింది రాధికకు.

"నవ్వు...నవ్వు! నీకంతా నవ్వులాటగా ఉన్నట్లుంది నాతపన చూస్తుంటే" దగ్గరకొచ్చి కూరేం చేస్తోందో చూస్తున్నట్లు అభినయిస్తూ అడిగాడు.

"మీరే చెప్పారుగా లాభం లేదని! మరో నాలుగురోజులకి మీ విరహ తాపా లని ఎక్స్‌టెండ్ చేసుకోవల్సిందే!"

"ఆc, నాలుగు రోజులా? ఎవరు చెప్పారు?" దిగులుగా అడిగాడు.

"మీ అక్కయ్యగారే! గురువారానికి వాళ్లు రిటర్న్ టికెట్స్ రిజర్వు చేసుకు న్నారట. పాపం, ఊర్నుంచి పదిరోజుల తర్వాత వచ్చారు కదాని ఈ రోజు రాత్రి కి మీరేం చెబితే అలా ... అసలు అడ్డు చెప్పకూడదనుకున్నాను. పాపం, అంతా కాన్సిలయింది."

ఊరిస్తున్నట్లు చెపుతున్న రాధికను చూసి మరీ గిలగిల్లాడాడు.

"అబ్బా! ఇక చెప్పకు రాధీ! చ్చొ ... చ్చొ ... ఎంత మంచి ఛాన్సు మిస్సయింది. ఆ సమయంలో మొగుడిమాట వినాలనే మంచి ఆలోచన మళ్లీ నీకెప్ప టికి రావాలి? పోయిందిపో ఛాన్సు!"

అతని మాటలు పూర్తి కానేలేదు, సుమతి వంటింట్లోకొస్తూ అడిగింది - "ఏమిట్రా తమ్ముడూ! ఏదో ఛాన్సు అంటున్నావు?"

చప్పున ఏం చెప్పాలో తోచక పారపోయింది మురళీధర్‌కి.

భర్తకి మంచినీళ్ల గ్లాసందిస్తూ రాధిక సర్దింది - "వాళ్ల ఫ్రెండ్‌సంగతిలెండి, వదినా! పాపం కొద్దిలో ఫారిన్ ఛాన్స్ మిస్సయిందిట!"

"అంతే మరి! ఎప్పటికెవరికి ఎంత ప్రాప్తమో! అంతా దేముడు ముందే రాసిపెట్టి ఉంటాడు. చేతిలో పెట్టినా నోటిదాకా పోతుందీ లేనిదీ చెప్పలేం!'

ఆమె ఇంకా ఏదో చెపుతూనే ఉంది. ఇంతలో - "అబ్బాయ్ .. మురళీ!" అంటూ తల్లి పిలుస్తూండడంతో మెల్లగా అటు జారుకున్నాడు మురళి.

ఆ రాత్రి పక్కలు ఓ చోట మగవాళ్లు పిల్లలకీ, అత్తగారి గదిలో వంశీకి, ఆడవాళ్లు ముగ్గురూ ఓ చోట - అలా ఏర్పాటు చేసింది రాధిక.

"అసలు పని లేకపోయినా కొసరు పన్లకూ ఛాన్సు లేకుండా పోయింది కదా!" అని భార్యను తలుచుకుని పళ్లు నూరుకున్నాడు మురళి. ఆపైన వాళ్లున్న నాలుగు రోజులు అలానే గడిచిపోయాయి. వాళ్లు తిరుగు ప్రయాణం పెట్టుకున్న గురువారం రాత్రి రానే వచ్చింది. ఆడపడుచులకి తాంబూలం ఇద్దామని ప్లేట్‌లో పండ్లు, జాకెట్ బట్టలు సర్దుతున్న రాధిక దగ్గరకొచ్చి మెల్లగా అన్నాడు మురళి -

"వీళ్లని ట్రెయినెక్కించి నేను వచ్చేసరికి పక్కలు అవీ మార్చి నీట్‌గా వేసి ఉంచు. వంశీని నిద్రపుచ్చెయ్!"

"అబ్బ! అలాగే. ఎవరన్నా వినగలరు. ఏమిటాయావ? ఏదో శోభనం పెళ్లి కొడుకులాగ!'

' భర్తని ముచ్చటగా విసుక్కుంది రాధిక.

మరో రెండుగంటల తర్వాత బంధువులందర్నీ రైలెక్కించి మంచి జాలీమూడ్‌లో ఇంటికి వచ్చాడు మురళీధర్.

రాధిక డల్‌గా కనిపించింది.

"ప్చ్ ... పాపం, పనెక్కువయి అలిసిపోయినట్లుంది!" భార్యపై ప్రేమ ముంచుకొచ్చేసింది.

తల్లి, వంశీ వాళ్ల పక్కపై నిద్రపోతూండడం చూసి సన్నగా విజిల్ వేసు కుంటూ తన బెడ్‌పై చేరాడు మురళి..

తలుపులన్నీ వేసుకుని, లైట్స్ ఆఫ్ చేసుకుని అలసటగా మంచం చేరు తున్న భార్యను ఆదరంగా చేతులు చాచి గుండెలపైకి లాక్కున్నాడు.

"పాపం, ఈ నాలుగురోజులుగా అతిథి మర్యాదలతో నానా హైరానా పడ్డావు. కాళ్లు నొప్పులుగా ఉన్నాయా? వత్తనా?" లాలనగా అడిగాడు.

"కాళ్లు మాత్రమే కాదు, నడుం కూడా లాగుతోంది!" నీరసంగా జవాబి చ్చింది.

"సరే సర్లే. నడుం కూడా వత్తుతా!" అంటూ తన నడుంపై చేయి వేస్తున్న భర్తను చూస్తూ, "ఇది పనివలన వచ్చిన నీరసం కాదండీ! అది. 'అది' వచ్చేసింది!" నసుగుతూ చెప్పింది.

"ఆఁ!" బాగా ఆకలిమీదున్న వాడికి నోటిదగ్గర నోరూరించే పదార్థాలు పెట్టి సరిగా తినబోయేసరికి ప్లేటు లాగేసుకుంటే ఎలా ముఖం పెడతాడో అలా ఉందతని ముఖం.

"అసలప్పుడే డేట్ కాదు. ఇంకా నాలుగు రోజులుంది. ఇంట్లో పనితో కాస్త ఎక్కువగా శరీరం అలిసిపోయేసరికి ముందే వచ్చేసినట్లుంది!" సంజాయిషీలా చెప్పింది.

"సరే, పోన్లే! అంతదాకా రాను. ఊరికే ఇక్కడ పడుకోనా?" ఎదమీద ముఖం పెట్టబోయాడు.,

"ఊహుఁ, వద్దండీ! నాకెలాగో ఉంది!" దూరంగా జరిగింది.

"ఇలాంటప్పుడు కూడా మామూలుగానే గడపొచ్చు అని సమరంగారి సలహాల్లో చదవలేదూ?' ' అప్పటికే బాగా వేడెక్కిపోయి ఉన్న మురళి అన్నాడు.

"నిజమే. అది ఇద్దరికీ ఇష్టం అయితే. కానీ నాకీ సమయంలో బాగుండదు. అసలే ఒళ్లంతా నొప్పులుగా కూడా ఉంది. ఒక్క మూడురోజులేగా ! ఆపై ..." ఆమె మాటలు పూర్తి కానేలేదు, పక్కలోంచి విసురుగా లేచాడు మురళి.

"నీకు దేనికీ ఇష్టం ఉండదు. నా మీద కూడా. నేనేమన్నా వేశ్యలదగ్గర కెళ్దామనుకున్నానా, లేక అక్రమసంబంధాలకై వెంపర్లాడానా? కట్టుకున్న పెళ్లాం దగ్గర కొద్దామంటే కూడా ఈ బతుక్కి ఏదో అడ్డంకే! ఛత్!" దిండు, దుప్పటి తీసుకుని హాల్లోకి వెళ్లిపోయాడు.

రాధిక కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి. "ఛ! ఏం మనిషి? నాకు మాత్రం ఉండదూ కోరిక. కానీ బయటున్నప్పుడు కూడా అంటే ఎలా? అయినా పక్క మీద చెప్పినట్లు వింటేనే పెళ్లాంపై ప్రేమ. లేదంటే అంతా ఎగిరిపోతుంది. మగాడికేం ఎప్పుడూ రెడీనే! ఆడదానికి బాధలేమిటో ఆడవారికే తెలుస్తాయి. దాదాపు పదిహేనురోజులకి ఒకపక్కపై చేరాం. సెక్స్ లేకపోతే మాత్రమేం ప్రేమగా నాలుగు మాటలు మాట్లాడకూడదూ?" ఉక్రోషంగా అనుకుంది.

ఆ తర్వాత రెండు రోజులు ముభావంగానే గడిచిపోయాయి వారిద్దరి మధ్య. కానీ మూడో రోజుకి రాధికే రాజీకొచ్చింది.

"పోన్లే, పాపం, ఆయన్ననేం లాభం? ఆయనే అన్నట్లు ఎన్ని రోజులు అది లేకపోయినా నేనే కావాలనుకుంటాడు కానీ ఆగలేక అడ్డదారులు తొక్కడు కదా!" అనుకుంది.

ఆ రోజుదయమే మురళి ఆఫీసుకి వెళ్లకముందే ఫ్రెష్‌గా స్నానం చేసేసి చక్కగా తయారయి అతని ఆఫీసుకి వెళ్తుంటే కర్చీఫ్, స్కూటర్ కీస్ అందిస్తూ నవ్వుతూ చెప్పింది - "త్వరగా వచ్చేయండి. లైన్ క్లియర్! రాజావారి కోరికలన్నీ తీరుతాయివాళ!"

మురళి కళ్లలోకి చప్పున మెరుపు వచ్చింది.

"ఇంత మాత్రానికే మీరంటే ఇష్టంలేదు, అదీ ఇదని గంతులేశారుగా!" బుంగమూతి పెట్టింది రాధిక.

మురళి అటూ ఇటూ చూశాడు. వంశీ స్కూల్‌కి వెళ్లిపోయాడు. తల్లి ఎక్కడో ఉన్నట్లుంది. చటుక్కున ముందుకి వంగి గులాబీ రంగులో మెరు స్తున్న భార్య అధరాలపై ఓ చిరుముద్ర వేశాడు. గబుక్కున అతన్నుంచి తప్పించుకుని గాబరాగా అటూ ఇటూ చూసింది రాధిక.

"ఎవరూ లేరులేవోయ్!" నవ్వాడు మురళి.

"చాల్లే సరసాలు, సరదాలు అన్నీ రాత్రికి వాయిదా వేసుకోండి!" కోప్పడింది.

"అంతేనంటావా, జీ హుకుమ్! అలాగే." నవ్వుకుంటూ వెళ్తున్న భర్తని ముచ్చటగా చూసుకుంది రాధిక.

ఆ సాయంత్రం ఆరున్నరయింది. ఏడున్నరయింది. కానీ మురళి ఇంటికి రాలేదు. రాధిక ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తుంటే ఎనిమిదికి హడావుడిగా వచ్చాడు.

"ఇంత లేటయిందేం?" అడుగుతున్న భార్యను చూశాడు మురళి. నీలిరంగు పువ్వులున్న తెల్లని షిఫాన్ చీర, తెల్లని జాకెట్, తలంటుకున్న కురులలో విరజాజులు, పాలరాతి శిల్పంలా ఉంది.

"ప్చ్ ..!" చిన్నగా నిట్టూర్చాడు.

"లేటు ఎందుకయిందంటే అలా చూస్తారేం?' ' అడిగింది.

"ఏం లేదు, త్వరగా నా సూట్‌కేసందుకో, నా బట్టలన్నీ ఇస్త్రీచేసున్నాయి కదూ! ముందు నాక్కాస్త పెరుగన్నం మాత్రం పెట్టు, చాలు!"

అయోమయంగా చూసింది రాధిక.

"నా ప్రయాణానికి టికెట్ రిజర్వేషన్ ఇదిగో. పదిగంటలకే రైలు. వెంటనే బయలుదేరాలి. రేపటికి ఫైల్సు అవీ రెడీ చేసుకునేసరికి ఈ టైమ్ అయింది. వారం రోజులుండాల్సిరావచ్చు. రెండు లుంగీలు పెట్టు! ఆఁ ఆ షేవింగ్ కిట్ ఇలా అందుకో ...! ప్చ్ ... ఏం చేయను? ఇందాక మా ఎం.డి. పిలిచి చెప్పాడు. తప్పదు కదా!"

గబగబా మాట్లాడుతూనే హడావుడిపడిపోతూ బట్టలు సర్దేసుకుంటున్న భర్తని మాటలు రానిదానిలా నిలబడి చూస్తూండిపోయింది రాధిక దిగులుగా - 'మళ్లీ కథ మొదలు' అనుకుంటూ.

